


# శాంతిప్రియుడు

బెంగాలీమూలం
సమరేష్ బసు
[అనువాదం: ఆర్.వి. లక్ష్మీదేవి]

అతడు ఫుట్‌బోర్డు మీద, తలుపు పక్క గజం పట్టుకుని నిలబడి వున్నాడు. ఎంత చికాకో! ఎదురు చూసిన బస్సు వచ్చి నిలబడి వుంది. ఎందరో ఎక్కుతారు. ఇలాదారికడ్డంగా నిలబడితే ఎలాగవుతుంది? నేను శాంతిప్రియుడిని, పీస్‌లవింగ్ అంటారే అలాంటి వాడిని. అకారణంగా వాదన, తగవులాట పెట్టుకోవడం నాకిష్టం లేదు. అదికాక రాత్రి తొమ్మిది అయిపోయింది. బస్సు దొరికింది. అదే పదివేలు. చాలా సార్లు, వచ్చి చూస్తే, బస్సు జాడే వుండదు. బస్సు అసలు వస్తుందో, రాదో కూడా ఎవరూ చెప్పలేరు, ముఖ్యంగా ఈ రూటులో, నార్తు కలకత్తా నుంచి బయలుదేరిన ఆ బస్సుకి, నగరపు పొలిమేరలలో వున్న గ్రామాలు గమ్యస్థానం.

ఈ సమయంలో ఎంతో రద్దీగా వుంటుందని, భయపడ్డాను. కాని అంత మంది ప్యాసెంజర్లు లేరు. ఇక్కడ ఏదైనా హత్యగటా జరిగిందో, లేక ఏదైనా బాంబు పేలిందో తెలియదు. అలా అయితే బస్సే రాకపోను. మొదటి సంగతి, ఇది ప్రైవేట్ బస్సు. అలాంటిదేదైనా జరిగి వుంటే, ముందరే సర్వీసు ఆపేసి వుందురు. అయితే ఈ రోజుల్లో, రాత్రిపూట తొమ్మిదిగంటలకి బస్సుల్లో ప్రయాణం చేసే ప్యాసెంజర్ల సంఖ్య చాలా తక్కువ. ఆ లెక్క ప్రకారం చూస్తే, ఈ రోజు బస్సులో జనం మరీ అంత తక్కువగా లేరు. కూర్చోడానికి సీటు ఒక్కటి కూడా ఖాళీ లేదు. అది నాకు బయటి నుంచే కనిపిస్తున్నది. కాని, లోపల నిలబడడానికి, చాలా జాగా వుంది. అందుచేత బస్సు ఖాళీగానే వుందని అనుకోవచ్చు. కలకత్తా పరిస్థితి పూర్వంలా వుండి వుంటే, ఇలాటి టైములో, బస్సులో నువ్వుగింజంత జాగా కూడా వుండకపోను. ఈ రోజు బస్సులో, కొద్దిమంది స్త్రీలు కూడా కనిపిస్తున్నారు. ఇటీవలి రోజుల్లో, ఈ టైములో, ఒకరిద్దరు తప్ప ఆడవాళ్లు బస్సుల్లో కనిపించడమే లేదు. అలాంటిది, ఈ రోజు ఒక పొడుగాటి సీటు నిండా ఆడవాళ్లున్నారు. బహుశ అందరూ కలిసి ఎక్కడికైనా వెడుతున్నారేమో. అలా కాకుండానూ వుండొచ్చు.

కాని ఇదంతా ఆలోచించి నాకేం లాభంలేదు. 'అతడు' అలా తలుపు పక్క రాడ్ పట్టుకుని నిలబడ్డాడెందుకు? 'అతడు' అంటే బాగులేదేమో, సన్నంగా వున్నాడు. మరీ పొడవూ కాదు, మరీ పొట్టీ కాదు. మధ్య రకంగా వున్నాడు. ఇరవై నాలుగు లేక ఇరవై అయిదు సంవత్సరాలున్న ఒక కుర్రవాడు. వేసుకున్న దుస్తుల్లో కొత్తదనం ఏదీ లేదు. ప్రస్తుతకాలంలో, అందరి ఒంటిమీద చూస్తున్నలాంటివే. మూడు అడుగుల ప్యాంటు, ఒకటిన్నర అడుగుల షర్టు- అలాంటివే. షర్టు బొత్తాములు విప్పి వున్నాయి. లోపలి బనియను కనిపిస్తోంది. కండక్టరు బస్సులోపల తలుపుకెదురుగా నిలబడి వున్నాడు. తలుపుకి అడ్డంగా నిలబడిన కుర్రాడికి- అతడిని 'కుర్రాడు' అనడం కూడా నాకిష్టం లేదు. ఏమనాలో? అతడిని పెద్దవాడు అనుకోవాలో, కుర్రాడు అనుకోవాలో తెలియడం లేదు. చేతిలో ఒక బైండు నోటు బుక్కు వుంటే స్టూడెంటు అనుకోవచ్చు. అతడిని చూస్తే అలా కూడా అనిపించదు. తైల సంస్కారంలేని చిన్న చిన్న వెంట్రుకలు నుదుటి మీద పడుతున్నాయి. సన్నటి మీసం

వుంది. కనుబొమలు ముడివడి వున్నాయి. సరిగ్గ, ఏదో రోగంతో బాధ పడుతున్నట్టు కనిపించకపోయినా, ఏ కారణం చేతనో, అతని ముఖం కఠినంగా వుంది. గట్టిగా బిగపట్టివున్న దవడలు చూస్తే అతడు కోపిష్టి అనీ, ఏదో అసంతృప్తితో బాధ పడుతున్నాడనీ తెలుస్తోంది.

అయి వుండవచ్చు, కాని అందరినీ ఇబ్బంది పెట్టి ఇలా తలుపుకి అడ్డంగా నిలబడ్డంలో అర్థం ఏమిటి? నేను తలుపుకి దగ్గరగా వెళ్లి నిలబడినా అతడు నన్ను చూడనట్లు నటించాడు. కండక్టరు కూడా అతన్ని పక్కకి జరగమని చెప్పలేదు. నా వైపు మాత్రం ఒకసారి ఉదాసీనంగా చూసేడు. సాధారణంగా ఇలా జరగవలసిన మాట కాదు. నేను, "కొంచెం పక్కకి తప్పుకుంటారా? లోపలికి వెళ్లాలి" అన్నాను.

'అతడు' తలుపు దగ్గర నుంచి కదలలేదు. పక్కనుంచి, ఎలాగోలాగ, లోపలికి దూరేను. అతని పక్కనుంచి దూరేటప్పుడు ఏదో కొద్దిగా వాసన వేసినట్టు అనుమానం కలిగింది. మద్యం వాసన! తాగుబోతు కాబోలు! అతిరిక్తమైన నిషాతో, అచ్చంగా శివుడిలా నిలబడి వున్నాడు. ఎలాంటి వాడైతే నాకేమిటి? నేను జోక్యం కలుగజేసుకోను. నేను పీస్ లవింగ్ మ్యాన్ని. రోజంతా కష్టపడి పనిచేసి వచ్చేను. ఒకదాని తరువాత ఒకటి, వరుసగా, డజనున్నర స్కెచ్‌లు గియ్యవలసి వచ్చింది. కమర్షియల్ ఆర్టు పని. వీపు నొప్పిగా వుంది. కళ్లు మంట. శరీరంలో శక్తి లేక జావకారిపోతున్నట్టుగా వుంది. సరిగ్గా అప్పుడు మీనాక్షి వచ్చింది.

మీనాక్షి రావడం వల్ల ఆ సాయంకాలం సరదాగా గడిచిందని చెప్పలేను. కాని ఆమె వస్తే టైము సరదాగా గడుస్తుందన్న ఆశ వుంది. ప్రస్తుతం నన్ను మీనాక్షి సందేహపు దృష్టితో చూస్తోంది. కొద్ది రోజుల బట్టి, నేను ఆఖరికి నా మాట నిలబెట్టుకోనేమోనన్న అనుమానం ఆమెకి పట్టుకుంది. అంటే ఆమెని పెళ్లి చేసుకోనేమోనని. ప్రస్తుతం నేను పనితో తీరిక లేకుండా వుండడం, ఆమెని నిర్లక్ష్యం చేస్తున్నానని అనుకుంటోంది. ఆ మాట సూటిగా నాతో అనలేదు. కాని మాట్లాడకుండా, మూతి ముడిచి కూర్చుంటుంది. నవ్వదు, సరిగ్గా నాతో మాట్లాడదు............ సరే, ఇప్పుడవన్నీ ఆలోచిస్తే ఏమవుతుంది? మీనాక్షి నాతో సరిగ్గా మాట్లాడి వుంటే,



మాటలు, పాటలు రాసే, సదాశివబ్రహ్మంగారు ఎప్పుడూ ఏదో ఛలోక్తి లేకుండా మాట్లాడేవాడు కాదు.

ఓసారి ఓ మిత్రుడు పిచ్చాపాటీగా 'నువ్వు వ్రాసిన దానిలో కనీవిని ఎరగనంత అభూతకల్పనలలో కూడుకున్నది ఏదీ?' అనడిగాడు.

దానికి సదాశివబ్రహ్మం తడుముకోకుండా 'నా ఇన్‌కంటాక్స్ రిపోర్ట్' అన్నాడు.

-మేడిశెట్టి.

నా మనసు బాగుండివుండును.

భుజం మీది సంచీ ఒకసారి సర్దుకుని, బస్సులో అటూ, ఇటూ చూసేను. లేదు, ఒక్క సీటు కూడా ఖాళీ లేదు. బస్సు ముందువేపు కండక్టరు కూడా నిశ్శబ్దంగా నిలబడి వున్నాడు. నాలాగే ఇంకా ఇద్దరు ముగ్గురు నిలబడే వున్నారు. జనం ఎంత తక్కువగా వున్నారో, దీని వల్ల తెలుస్తూనే వుంది. రాత్రి తొమ్మిదే అయింది. ఇలాంటప్పుడు, చాలా రద్దీగా, జనం కిక్కిరిసి వుండవలసిన మాట. ఈ టైములో, కండక్టర్లు జనం మీద అరుస్తూ వుండవలసిన మాట. బస్సులో మనుషులు కూడా ఎక్కువగా మాట్లాడటం లేదు. ఈ రోజుల్లో ఇలాగే వుంటోంది. ఎవరూ ఎక్కువ మాట్లాడ్డానికిష్టపడరు. నోరు విప్పితే, అనవసరపు మాటలు ఏమైనా జారి బయటికి వచ్చేస్తాయేమో, దాని వల్ల ఏదైనా ఆపద కలుగుతుందేమోనని భయం. కాని ముందుగా బస్సు ఎక్కితే, ఏ కొద్ది మందివైనా, వాగుడు చెవిని పడే ఇబ్బంది వుంది. ఎంత చిరాగ్గా వుంటుందో! కాని, ఇలా ఎవ్వరూ ఏం మాట్లాడకుండా నిశ్శబ్దంగా కూర్చోడం కూడా బాధగానే వుంటుంది. ఈ రూటులో, ముఖ్యంగా ఈటైములో, చాలా వరకు చూసిన ముఖాలే. కాని ఎవరితోనూ, నాకు మాట్లాడే అంత పరిచయం లేదు. కాని చాలా మందికి, మిగతా ప్రయాణీకులతో ముఖ పరిచయం వుంది.

ఎవరో గొంతు తగ్గించి ఏదో మాట్లాడుతున్నారు. డ్రయివరు తన సీటులో కూర్చుని వున్నాడు. కండక్టరులిద్దరూ చెరో తలుపు దగ్గర నిలబడి వున్నారు. ప్యాసింజర్లలో ఒక మధ్య వయస్కుడు ఏదో వాగుతున్నాడు. 'ఎక్కడికెళ్లినా శాంతి లేదండి, బజారుకెళ్లండి, వంకాయ ధర వింటే............' ఆ సోది అంతా వినడానికి నాకేం ఉత్సాహం లేదు.

"బస్సు బయలుదేరే టైమయింది. ఎప్పుడు కదులుతుంది?" అని ఒక యాత్రికుడు గొంతెత్తి అడిగేడు. కండక్టర్లు ఆ మాటకి ఏ జవాబూ చెప్పలేదు. అసలు ఆ మాట వినిపించనట్టే వూరుకున్నారు. తలుపుకి అడ్డు నిలబడిన 'అతడు' లేక 'కుర్రాడు- ఎవరైతేనేం-- కండక్టరు వేపు ఒకసారి చూసేడు. అతని కంటి రెప్పలు...............' కళ్లు సాన పట్టిన చాకుల్లా వాడిగా వున్నాయి.

సంగతేమిటో అర్థం కావడం లేదు. 'అతడు' బస్సులో ప్రయాణీకుడు కాదు అన్నమాట స్పష్టంగా తెలుస్తున్నాది. బస్సు బయలుదేరడం లేదెందుకు? నేను చెప్పవలసింది ఏమీ లేదనుకోండి. నేను శాంతి ప్రియుణ్ణి. నేను ఒక శాంతి ప్రియుడినైన ఆర్టిస్టుని. నాకు ఇలాంటి విషయాల్లో జోక్యం కలగజేసుకోవడం ఏం నచ్చదు.

హఠాత్తుగా గర్జిస్తున్న స్వరంలో, "గేటు కడ్డంగా నిలబడ్డం ఎందుకు? లోపలికి వెళ్లలేరా? లోపల చాలా జాగా వుందే! ఎక్కండి. లేకపోతే దిగండి." అన్న మాటలు వినపడ్డాయి.

అటువేపు చూసేను. సుమారు ఏభై ఏళ్ల పెద్దమనిషి. గేటుకడ్డంగా నిలబడిన 'అతడితో' ఆ మాటలు కటువుగానే అన్నాడు. అది ఆ పెద్దమనిషి ఆజ్ఞలా వినిపించింది. నిజమే మరి. అలా నిలబడ్డంలో అర్థం ఏమిటి? ఆ తరువాత కూడా 'అతడు' కదలలేదు. ఆ పెద్ద మనిషి వేపు చూస్తూ వుండిపోయేడు. నాకు 'అతడి' ముఖం కనబడ్డం లేదు. ఆ పెద్ద మనిషి మళ్లీ అరుస్తూ, "ఏమయింది? నన్ను బస్సు ఎక్కనివ్వరా?" అని అడుగు ముందుకి వెయ్యబోయేడు. అంతే, ఆ మూడడుగుల ప్యాంటు, ఒకటిన్నర అడుగుల చొక్కా, ఫుట్‌బోర్డు మీద నుంచి దిగి కింద నిలబడ్డాడు. పెద్దమనిషి బస్సు ఎక్కి, స్త్రీల సీటుకి ఆనుకుని, హైరాడ్ పట్టుకుని నిలబడి, "అంతా మొండితనం! తలుపుకి

అడ్డుగా నిలబడ్డం! ఇంక ఎవరికీ బస్సు ఎక్కే అవసరం లేనట్టు!..... అని సణగడం మొదలుపెట్టేడు.

ఆ పెద్ద మనిషి మాటలు సబబుగా వున్నాయని అందరూ మనసుల్లో అనుకున్నా, అందరూ నాలాగే శాంతిప్రియులు కదా! అందుచేత ఎవ్వరూ ఏం మాట్లడలేదు. అయితే, అతడి పాతరకం వ్యవహారం చూసి - పాతరకం అనే అనాలి - ఈ రోజుల్లో ఎవ్వరూ అలా మాట్లాడరు, అందరికీ కాస్త సంతోషం వేసినట్టే అనిపించింది. కాని బస్సు కదిలే సూచన లేదు. మళ్లీ ఎవరో, "ఏమయింది? బస్సు బయలుదేరడం లేదెందుకు?" అని అరిచేరు.

"అతడు" మళ్లీ బస్సు ఫుట్‌బోర్డు మీదకి ఎక్కి నిలబడ్డాడు. అయిదు నిమిషాల తరువాత, "లేదు. ఆ వెధవ రాడు. బస్సు పోనియ్యి." అన్నాడు. ఈ మాటలు వినీ వినడంతో కండక్టరు బెల్లు వాయించేడు. డ్రయివరు బస్సు స్టార్టు చేసేడు. కండక్టరు టికెట్లు ఇవ్వడం మొదలుపెట్టేడు. ఇప్పుడు అర్థమయింది. 'అతడి' అనుమతి లేకపోవడం చేతనే ఇంతసేపూ బస్సు బయలుదేరలేదు. ఎందుచేత? 'అతడు' ఎవరు? అయితే, ఆ విషయం తెలుసుకోవలసిన అవసరం నాకు లేదనుకోండి. ఏదో విధంగా నా గమ్యస్థానం చేరుకోగలిగితే అంతే చాలు. 'అతడి' వాళ్లు ఎవరో రావలసిన మాట కాబోలు, రాలేదు. అందుకని బస్సు స్టార్టు చేసెయ్యమన్నాడు. 'అతడి' మాట మీదే బస్సు నడుస్తుందా? 'అతడు' ఎవరు? మళ్లీ ఆ మాటనా మనస్సులో మెదిలింది. కాని అనుకుని ఏం లాభం లేదు. ఎవరైతేనేం, నాకు తెలుసుకోవలసిన అవసరం లేదు. అయినా, కొంచెం మనస్సు పాడయింది. 'అతడిని' ఎప్పుడూ చూసిన జ్ఞాపకం లేదు, ఏమో చూసేనేమో, జ్ఞాపకం రావడం లేదు.

'అతడు' ఫుట్‌బోర్డు మీద నుంచి బస్సు లోపలికి వచ్చేడు. వచ్చి ఆ పెద్ద మనిషికి ఎదురుగా నిలబడ్డాడు. అతడి ముఖం ఇంకా కఠినంగా కనిపిస్తున్నది, కళ్లు రెండూ అగ్నిగోళాల్లా వున్నాయి. సంగతేమిటో అర్థం కాక ముందే, "ఏమిటీ? కళ్లెర్రజేసిమాట్లాడుతున్నావ్?" అన్న మాటలు వినిపించేయి.

ఆ పెద్దమనిషి కాస్త ఆశ్చర్యపోయి, "అంటే?" అన్నాడు. అప్పుడు, 'అతడు' ఆ పెద్దమనిషి చెంప ఛెళ్లు మనేటట్టు కొట్టేడు. "వెధవా! ఎవరితో మాట్లాడుతున్నావో తెలియదా? నీ కోపం చూపిస్తున్నావా? ఈ రోజు నీపీక నులిమేస్తాను!" అని ఆ పెద్దమనిషి గుండెల మీద షర్టు గట్టిగా పట్టుకున్నాడు. బస్సులో వున్న వాళ్లందరూ బెదిరిపోయేరు. కాని ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. నేను దగ్గరలోనే వున్నాను. కొంచెం జరిగి నిలబడ్డాను. పెద్దమనిషి చెంప చేత్తో పట్టుకుని, "ఏమిటిదంతా? నేనేమిటి చేసేను?" అన్నాడు.

"ఏమిటి చేసేవో తెలీదా?" అని 'అతడు' మళ్లీ పెద్దమనిషి ముఖం మీద చేతి మండతో కొట్టేడు. షర్టు ఇంకా లాగి గట్టిగా పట్టుకుని, "తాగి వచ్చి తందనాలాడుతున్నావా? అమ్మలు, అక్కలు, చెల్లెళ్లతో మర్యాద లేకుండా ప్రవర్తిస్తావా?" అని ఒక్కసారి పెద్దమనిషి డొక్కలో, కాలి ముణుకుతో పొడిచేడు. పెద్దమనిషి బాధతో గట్టిగా అరిచేడు. రౌడీ ('అతడు') ముఖం ఇంకా భయంకరంగా కనిపించింది. ఆ దృశ్యం, చిరుతపులి నోట్లో గిలగిల కొట్టుకుంటున్న మేకలా వుంది. ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. ఎందుకంటే, అందరూ నాలాంటి శాంతి ప్రియులే కదా మరి! ఇలాంటి విషయాల్లో తల దూర్చడం ఎవరికీ ఇష్టంలేదు. ఎలా అయితే అలా అవనీ అని అందరూ వూరుకుండి పోయేరు. కాని ఆ పెద్దమనిషి వంటిమీద పడుతున్న దెబ్బలు నా వంటిమీద పడుతున్నట్టే బాధనిపించింది. నా కడుపులో దేవినట్టుగా వుంది. నేను గీసిన డజనున్నర స్కెచ్‌లూ, మీనాక్షి ఏ సంగతీ గుర్తు రావడం లేదు. నేను నా అస్తిత్వాన్ని గురించి భయంతో నిలువెల్లా వణికిపోతున్నాను. ఆడా, మగా, చిన్నా, పెద్దా అందరికళ్లల్లో భీతి, బెదురు.


పెద్దమనిషి ఆర్తస్వరంతో, "అమ్మలని, అక్కచెల్లెళ్లనీ అవమానిస్తూ నేనేం చేసేను?" అన్నాడు. రౌడీ, పెద్దమనిషి ముఖం మీద ఒక గుద్దు గుద్ది, "నేను చూడలేదనుకుంటున్నావా? ముణుకులతో ఆడవాళ్ల శరీరాల్ని తాకేటట్టు", వాళ్ల సీటుకి దగ్గరగా నిలబడలేదూ? అందుకే అక్కడికి వెళ్లి నిలబడ్డావు. నా కళ్లు కప్పగలననుకున్నావా?" అని గర్జించేడు. పెద్దమనిషి పెదవులు పగిలి రక్తం కారుతున్నాది.

"అబద్ధం" అన్నాడు.

"నోరుముయ్యి" అని రౌడీ మళ్లీ అతడి చెవి మీద ఒక గుద్దు గుద్దేడు. కండక్టరు బస్సు ఆగడానికి గంట వాయించేడు. రౌడీ గట్టిగా, "బస్సు ఆపొద్దు. స్టాపేజీ దాటి ఆగాలి. ప్యాసెంజర్లు దిగుతారు. ఎవ్వరినీ ఎక్కనివ్వొద్దు. లేకపోతే బస్సు కాలిపోతుందని చెప్తున్నాను"! అని అరిచేడు.

బస్సు స్టాపేజీలో నిలబడలేదు. ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. నాలాగే శాంతిప్రియులైన ప్యాసెంజర్లు అందరూ భయం, బెదురూ నిండిన కళ్లతో, జరిగినదంతా చూస్తూ వుండిపోయేరు.

పెద్దమనిషి పైన రాడ్ పట్టుకుని వేళ్లాడుతున్నాడు. ఇంక పడిపోతాడేమోననిపిస్తున్నాది. అయినా రౌడీ కొట్టడం ఆపలేదు. ద్వేషం, కోపంతో బుసలు కొడుతూ, ఆ పెద్ద మనిషిని కొడుతూనే వున్నాడు. అతడు చెయ్యి పట్టు తప్పి రాడ్ వదిలేసేడు. అయినా, "నేను తాగి రాలేదు. ఆడవాళ్ళని అవమానించే పని ఏదీ చెయ్యలేదు. నన్నెందుకు ఊరికినే కొడుతున్నావు" అన్నాడు.



"మళ్లీ అబద్ధాలా? నేను నా కళ్లతో చూసేను. అందుకే, నన్ను బెదిరించి తొందరగా లోపల దూరేవు." అని, ఈ సారి మెడ మీద ఒక గుద్దు గుద్దేడు. పెద్దమనిషి "నన్ను చంపేస్తున్నాడు, రక్షించండి." అంటూ బాధతో అరిచేడు.

బస్సు స్టాపేజి దాటి ఆగింది. ఇద్దరు స్త్రీలతో సహా కొంతమంది ప్యాసెంజర్లు దిగిపోయేరు. వెంటనే బస్సు మళ్లీ బయలుదేరింది. కండక్టరు టికెట్లు ఇస్తున్నాడు. అందరూ అతనికిడబ్బులిస్తున్నారు, కాని ఎవ్వరూ ఏం మాట్లాడ్డం లేదు. అందరి ముఖాలలో ఆత్రుత. నిశ్శబ్దంగా కూర్చుని వున్నారు. గమ్యస్థానం కోసం ప్రాణాలుగ్గ పట్టుకుని ఎదురుచూస్తున్నారని వాళ్ల ముఖాలు చూస్తేనే తెలుస్తున్నాది. అందరూ నాలాగే ఉత్కంఠ, భయంతో వణికిపోతున్నారు. శాంతిప్రియులు అయిన వాళ్లు, ఇలాంటి విషయాల్లో తల దూర్చడానికి ఇష్టపడతారా? కాని నేనింక బస్సులో వుండలేకుండా వున్నాను. తెలివి తప్పిపడిపోతానో, ఇంకేమైనా అవుతుందో, తెలియకుండా వుంది. నా మీద నాకే నమ్మకం లేకుండా పోతు ది. లోపలి నుంచి ఎలాంటి వణుకు పుట్టుకొస్తున్నాదంటే, నా పరిస్థితి అధ్వాన్నంగా వుందని తెలుస్తున్నాది. నేను కూడా, బహుశ, ఆ పెద్దమనిషి లాగే భయంతో, అరుస్తానేమోనని పిస్తున్నది.

"రక్షించండి! రక్షించండి! నన్ను చంపేస్తున్నాడు!" అని అతడు మళ్లీ అరిచేడు.

ఆ పెద్దమనిషి ఇప్పుడింక తనంతట తను నిలబడలేక పోతున్నాడు. రౌడీయే అతడివి నిలబెట్టి, అదేపనిగా కొడుతూనే వున్నాడు. అతడి ముఖమంతా రక్తమయం. కనుబొమల దగ్గరా, కణతలూ, పెదవులూ, గడ్డం అన్నీ వాచిపోయి వున్నాయి.

సరిగ్గా అలాంటప్పుడు, హఠాత్తుగా అందరినీ ఆశ్చర్యపరుస్తూ, ఒక స్త్రీ గొంతు వినిపించింది. "అతడు మమ్మల్ని ఎవరినీ అవమానపరచలేదే? ఆ మాట అంటారెందుకు?" అంది.

రౌడీతో పాటు అందరూ, ఆమె వేపు చూసేరు. సుమారు పాతికేళ్లు వుంటాయి, తెల్లటి శరీరచ్ఛాయ, ఆరోగ్యంగా వుంది. చేతిలో ఒక బ్యాగు వుంది. రౌడీ ఆమె వేపు తిరిగి, "మీరు నోరు మూసుకోండి, మీతో నేను మాట్లాడ్డం లేదు," అన్నాడు.

ఆమె నిజంగా వీరాంగన అనిపించింది. చూడ్డానికి, చాలా వరకు, మీనాక్షి లావుంది. ఇంత ధైర్యం ఎలా వచ్చిందో?

"ఎందుకు నోరు మూసుకోవాలి? అతడు ఆడవాళ్లని అవమానించేడని మీరు అంటున్నారు. మేము ఇక్కడ కూర్చున్నాము, కాని అతడు మమ్మల్నేం చెయ్యలేదే?" అంది.

రౌడీ ఇంకా గర్జిస్తూ, "ఒకే లైను వాళ్లు కాబోలు! నోరు మూసుకోమంటున్నాను, నోరు మూసుకుని కూర్చోండి." అన్నాడు.

ఆమె కూడా గొంతు హెచ్చించి, "ఒకే లైను వాళ్లంటే? మీ ఉద్దేశం ఏమిటి?" అంది.

రౌడీ ఆమె వేపునుంచి, పెద్దమనిషి వేపు తిరిగేడు. కొట్టడానికి మళ్లీ చెయ్యి ఎత్తేడు. సరిగ్గా అప్పుడు, నా గొంతు వినిపించింది. "ఎందుకు నిష్కారణంగా అతడిని కొడుతున్నారు? అతడు మిమ్మల్ని ఏమీ అనలేదే?" అని.

రౌడీ నా వేపు చూసేడు. అచ్చంగా, వంకర కొమ్ములున్న ఎనుబోతులా కనిపించేడు. ఎందుకలా అన్నానో నాకే తెలియలేదు. ఈ కారణం చేతనే, నా మీద నాకే నమ్మకం లేకుండా వుంది. నిజానికి, "ఆ పెద్దమనిషిలాగ, బాధతో అరవడం కాదు, ఇంకేదైనా చెయ్యవలసింది" అన్న మాటలు నా పెదవులు చివరి వరకు వచ్చి ఆగిపోయేయి. నేను శాంతిప్రియుణ్ణి అనీ, ఏమీ మాట్లాడననీ అనుకున్నాను. కాని ఆమే అంతా గందరగోళం చేసేసింది. అంతా సాఫీగానే జరిగిపోతూ వుంది. పెద్దమనిషి చావబోతున్నాడు. రౌడీ నా వేపు చూసేసరికి నా గుండెల్లోంచి వణుకు వచ్చింది.

రౌడీ నా వేపు చూసి, హుంకరిస్తూ, "ఏమయింది, నీకు?" అన్నాడు.

ఇప్పటికైనా మించిపోలేదు. మాట్లాడకుండా వుంటే బాగుండిపోను. కాని నన్ను నేను అదుపులో పెట్టుకోలేకపోయేను. అతి శాంతంగా, నెమ్మదిగా, "ఎందుకు ఉత్తిపుణ్యానికి అతడివి కొడుతున్నారు? అతనేం చెయ్యలేదే?" అన్నాను.

ఈ మాటలు నేను అన్నట్టు కాకుండా, ఎవరో నా లోపలి నుంచి అనిపించినట్టుగా వున్నాయి. నేను ఎటు వైపూ చూడలేదు.

కేవలం ఒక్క గర్జన లాంటి అరుపు వినిపించింది.

"బస్సు ఆపు" అని.

బస్సు ఆగింది. రౌడీ పెద్ద మనిషిని వదిలేసేడు. అతడు దభీమని పడిపోయాడు. రౌడీ నా వేపు వచ్చేడు. పంజా ముందుకి జాపి మెడ దగ్గర నా చొక్కా గట్టిగా పట్టుకొన్నాడు. "రా, చెప్తాను," అని నా చొక్కా ఇంకా గట్టిగా లాగేడు. నేను విడిపించుకోడానికి ప్రయత్నించేను. 'అతడు' నన్ను గేటు దగ్గరకి ఈడ్చుకుని వెళ్లేడు. నేను, "ఎక్కడికి తీసుకెడుతున్నావ్? నన్ను వదిలెయ్యి," అని అరిచాను. రౌడీ అరవలేదు. నన్ను జోరుగా లాగుతూ, "వదిలేస్తాను. నిన్నెవడూ ఇక్కడ పట్టుకుని కూర్చోడు. ఎవరితో మాట్లాడుతున్నావో నీకు తెలియడం లేదు." అన్నాడు.


నేను ఎంత ప్రయత్నించినా విడిపించుకోలేకపోయేను. ఆ అమ్మాయి వైపు ఒకసారి చూద్దామని వుంది. కాని చూడలేకపోయేను. ఇంకెవరివైపూ చూడాలని కూడా అనిపించలేదు. రౌడీ నన్ను బస్సు లోనుంచి లాగి దింపేసేడు. గట్టిగా అరిచి, "బస్సు పోనియ్యి," అని ఆజ్ఞాపించేడు. బస్సు ఇంజిను డ్రయివరు ఆఫ్ చెయ్యలేదు. హుకుం విని వినడంతో డ్రయివరు బస్సు స్టార్టు చేసేడు. అది 'భోం భోం' అని శబ్దం చేస్తూ కదిలిపోయింది. రౌడీ నన్ను అలా ఈడ్చుకుని వెడుతూనే వున్నాడు. నేను విడిపించుకోడానికి ప్రయత్నం చేస్తూనే వున్నాను. ఎక్కడ దిగేమో, ఆ జాగా పేరేమిటో తెలియడం లేదు. చుట్టూ చూస్తే పోల్చుకోగలిగివుందును. కాని ఎటువేపూ తిరిగి చూసే అవకాశం లేదు. ఏదో రోడ్డు. మిణుకు మిణుకు మంటూ దీపాలు వెలుగుతున్నాయి.

హఠాత్తుగా, రౌడీ నా ముఖం మీద ఒక గుద్దు గుద్దేడు. "సాలా! ఈ రోజు నీ ప్రాణం తీస్తాను చూడు," అన్నాడు. అప్పటికే నేను అతని పట్టు విడిపించుకోడానికి ప్రయత్నం చేస్తూనే వున్నాను. నా పెదవులు రక్తంతో తడిసిపోతున్నాయి. నా చొక్కా చింపేసి, అదేపనిగా కొట్టడం మొదలుపెట్టాడు. నా కళ్లు చీకట్లు కమ్మేయి. నా ముక్కు, కళ్లు, పెదవులు, ఎక్కడా కొట్టని జాగా లేదు. రౌడీ చేత్తోనే కొడుతున్నాడో, ఇంక దేనితోనైనా కొడుతున్నాడో అర్థం కాలేదు. నా ముఖం అంతా పగిలి రక్తం కారుతోంది. ఆ స్థితిలోనే, నన్ను తోసి, తోసి, ఒక వైపుకి తీసుకుపోయేడు. నా భుజం మీద వున్న బ్యాగు జారిపడిపోయింది. ఆ పెద్దమనిషి సంగతి జ్ఞాపకం వచ్చింది. ఇంకా కొంచెం సేపు ఇలా కొడితే నేను

చచ్చిపోతాను, అనిపించింది. నన్ను చంపేద్దామనే కొడుతున్నాడు. రౌడీకి వివరించి చెప్పడానికేం లేదు. అతని గురించి నాకు బొత్తిగా తెలియదు. కాని ఏ నిముషంలో నన్ను చంపేద్దామనుకుంటున్నాడని అర్థం అయిందో, నేను నిటారుగా నిలబడ్డాను. దెబ్బలు పడకుండా అడ్డుకోడానికి ప్రయత్నించేను. జీవితంలో మొట్ట మొదటిసారి, జ్ఞానం వచ్చి పెద్దవాడినయేక, ఒక మనిషి ముఖం మీద ఒక గుద్దు గుద్దేను.

"నా ఒంటి మీద చెయ్యి వేస్తావా?" అన్న మాటలు వినిపించేయి. రౌడీ నా మెడ మీదకి ఉరికేడు. సరిగ్గా అప్పుడు, ఎవరిదో గొంతు వినిపించింది. రౌడీ నన్ను నేల మీద పడేసి నా గొంతు పిసకడానికి ప్రయత్నిస్తున్నాడు. అప్పుడు ఎవరో ఆడవాళ్ల గొంతులు కూడా వినిపించేయి. "అదిగో, అక్కడ," అని.

నేను రౌడీని రెండు చేతులతో తోసెయ్యడానికి ప్రయత్నిస్తున్నాను. వాడు మొణుకులతో నా డొక్కలో పొడుస్తూనే వున్నాడు. ఎంతోమంది నడిచి ఇటు వస్తున్నట్టు అడుగుల చప్పుడు వినిపించింది.




ఏదో రాయి లాంటిది నా ముఖం మీద గట్టిగా తగిలింది. ఆ తరువాత ఏం జరిగిందో జ్ఞాపకం రావడం లేదు...............


ఇప్పుడు నేను హాస్పిటలు బెడ్డు మీద పడుకుని వున్నాను. తలకి ముఖానికి బ్యాండేజి కట్టి వుంది. ఒళ్లంతా పచ్చిపుండులా వుంది. మందు రాసేరు. ఇంతవరకు నన్ను చూడ్డానికి ఎవ్వరూ రాలేదు. రౌడీ ముఖమే నా కళ్లకింకా కనిపిస్తున్నది. వాడిది ఒక స్కెచ్ గియ్యగలను. ఎందుకు వాడు నన్ను చంపెయ్యలేదో, ఇప్పటికీ తెలియదు. వాడు ఎవడు? వాడికెందుకు అంత కోపం, ద్వేషమూను. ఎందుకలా ఖూనీ కోరులా తయారయ్యేడు? నాకు ఏ సంగతీ తెలియదు. నేను శాంతిప్రియుడిగా వుందామనుకున్నాను, దాన్ని శాంతిప్రియత్వం అంటారో, ఇంకేం అంటారో నాకేం తెలియదు. కాని నేను శాంతిప్రియుడిగా వుండలేకపోయాను.

# లజ్జ

ఈ మధ్య "లజ్జ" అనే ఒక బెంగాలీ నవల బంగ్లాదేశ్‌లో పెద్ద సంచలనాన్ని సృష్టించింది. అది గొప్ప నవల కాదు. దాన్ని పూర్తిగా నవల అనటానికి కూడా వీల్లేదు. భారతదేశ విభజన జరిగాక తూర్పు బెంగాల్లో హిందువులపట్ల ముస్లింలు ప్రదర్శించిన వివక్షతనూ, దౌర్జన్యాన్నీ నేపథ్యంగా తీసుకుని రాసిన డాక్యుమెంటరీ నవల.

1992 డిసెంబరు ఆరవతేదీ బాబ్రీ మసీదును కూల్చి వేశాక బంగ్లాదేశ్‌లో ఓ హిందూ కుటుంబం అనుభవించిన దారుణ హింసను కథగా తీసుకుని ఢాకాలోనూ ఇతర ప్రాంతాల్లోనూ జరిగిన హిందూ గృహ దహనాలనూ, హిందూదేవాలయాల విధ్వంసాలనూ, కళ్లకు కట్టినట్లు ఈ 'నవల కాని నవల చిత్రించింది.

ఇది 79 పేజీల చిన్న నవల. దీన్ని రాసింది ' "తస్లీమానస్రీన్" అనే ఓ ముప్పై ఒక్కేళ్ళ యువతి. ఇటీవలిదాకా ఆమె ఢాకా



లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో 'గైనకాలజిస్టు'గా పనిచేసింది.

ముస్లిం సమాజంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ ఆమె దినపత్రికలకూ, వారపత్రికలకూ రాస్తూ ఓ యువ రచయిత్రిగా గుర్తింపు పొందింది.

ఆరు కవితాసంపుటాలూ, "నిర్వచిత కాలం" అనే పేరుతో మూడు వ్యాస సంపుటాలూ, ఆరు నవలికలూ రాసి ప్రచురించింది. "లజ్జ" అనేది ఆమె రాసిన ఇటీవలి నవల. ఆ నవల మతవిద్వేషాలకు దారితీయవచ్చుననే కారణం మీద బంగ్లాదేశ్ ప్రభుత్వం దాన్ని నిషేదించింది.

ఆ నవల 1993 ఫిబ్రవరిలో వెలువడింది. దాని బహిష్కారం అక్టోబరు మాసంలో జరిగింది. ఈ ఏడు మాసాల్లో బంగ్లాదేశ్‌లోని ముస్లిం మతోన్మాదులు ఆ నవలను బహిష్కరించాలనీ, తస్లీమా చేసిన ఇతరరచనలను ప్రభుత్వం స్వాధీనపరుచుకోవాలనీ, 'దైవ దూషణ' అనే నేరం క్రింద ఆమెను విచారించి కఠినంగా శిక్షించాలనీ, ఖలీదా ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు.

బంగ్లాదేశ్‌లోని 'సిల్హాత్' అనే చోట కొంత మంది యువకులు ఊరేగింపుగా వెళ్లి తస్లీమానస్రీన్ గడ్డి బొమ్మను వురితీసి తగులబెట్టారు. "సాహాబా సైనిక్ పరిషత్" అనే సంస్థ వారు ఆమెను తక్షణమే అరెస్టు చేసి తగిన శిక్ష విధించకపోతే దేశవ్యాప్తంగా ఊరేగింపులూ, ప్రదర్శనలూ,